# వైద్యానికి అమెరికన్లూ అమరావతి రావాల్సిందే

- ఏఏఐఎంఎస్ ఆస్పత్రి శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు
- గుంటూరు, విజయవాడలోనే విజ్ఞానం పుట్టింది
- ఇక్కడ్నుంచి హైదరాబాద్‌కు.. ఆ తర్వాత దేశానికి వెళ్లింది



ఏఏఐఎంఎస్ శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు

**సాక్షి, అమరావతి:** అమరావతి అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఏఐఎంఎస్)ను ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా తీర్చిదిద్దాలని నిర్వాహకులను సీఎం చంద్రబాబు కోరారు. భవిష్యత్‌లో అత్యుత్తమ వైద్య సేవలు అమరావతిలో అందుబాటులోకి రానున్నాయని.. అమెరికన్లు కూడా వైద్యం కోసం అమరావతికి రావాల్సిందే నన్నారు. ఇబ్రహీంపట్నంలో నిర్మించనున్న ఏఏఐఎంఎస్ ఆస్పత్రికి సంబంధించిన శంకుస్థాపన శిలాఫలకాన్ని గురువారం విజయవాడలోని ఏ–1 కన్వెన్షన్ సెంటర్ నుంచి సీఎం రిమోట్ కంట్రోల్ ద్వారా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రవాసాంధ్రులు అమెరికాలో సంపాదించిన విజ్ఞానాన్ని, కష్టార్జితాన్ని ఇక్కడకు తీసుకొచ్చి.. ఆస్పత్రి ఏర్పాటు చేస్తుండటం అభినందనీయమన్నారు. శస్త్ర చికిత్స కోసం ఎన్టీఆర్ అమెరికాకు వెళ్లాల్సి వచ్చిందని.. కానీ ఇకపై ఎవరైనా వైద్యం చేయించుకోవాలంటే అమరావతికి రావాల్సిందే నన్నారు. భవిష్యత్‌లో రాజధాని అమరావతిలో 13 వైద్య కళాశాలలు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. ఎస్ఆర్ఎం, వీఐటీ తదితర సంస్థలు ఇక్కడ వైద్య కళాశాలలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాయని వివరించారు. ఒకప్పుడు కుటుంబ నియంత్రణను ప్రోత్సహించానని.. కానీ ప్రస్తుతం యువతీయువకుల శాతం తగ్గిపోయే ప్రమాద మున్నందున ఎక్కువ మంది పిల్లలను కనాలని ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా సేంద్రీయ విధానంలో పంటలు పండించాలని రైతులకు సూచించారు. గుంటూరు, విజయవాడలోనే విజ్ఞానం పుట్టిందని, ఇక్కడ్నుంచే హైదరాబాద్‌కు.. ఆ తర్వాత దేశానికి వెళ్లిందని సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు కామినేని శ్రీనివాస్, దేవినేని ఉమా, భూమా అఖిల ప్రియ, ఎంపీ కేశినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.